శంకర్‌ని కలవటానికే నిర్ణయించుకున్నాడు నిఖిల్.

ఈ నడుమ కాలంలో పాత స్నేహితులు కలసిన చోట 'శంకర్' ప్రసక్తి తప్పనిసరిగా వుంటోంది. చదువుకునే రోజుల నుండి శంకర్ ఆలోచనలు ప్రత్యేకంగా వుండేవి. తను పైకి రాగలడని నిఖిల్‌కి అనిపించేది. వచ్చాడు కూడా.

# విశ్వరూపం

పి. చంద్రశేఖర అజాద్



ఇటీవల భాగ్యనగరంలో ఓ బ్రాంచీ వెలకొల్పాడని చెప్పారెవరో. శంకర్‌ని చూసి చాలా సంవత్సరాలైంది. మొదట్లో చిన్న ప్రెస్సు వుండేది. అందులో తనే కంపోజ్ చేసుకుని చిన్న ట్రెడిల్ మెషిన్ మీద స్వయంగా ముద్రణా కార్యక్రమం జరిపించేవాడు. మెల్లగా తమ్ముళ్ళనీ, బంధువులనీ చుట్టూ చేర్చుకున్నాడు.

ఇప్పుడా ప్రెస్సును ఆధునీకరించాడు. ఆ వైభవం చూడవలసిందేగాని మాటల్లో చెప్పటం సాధ్యం కాదని విన్నప్పుడు నిఖిల్‌కి మరోసారి ప్రలోభం కలిగింది. పెట్టెలో మూలుగుతున్న ఆ పుస్తకం బయటకు తీశాడు.

ఏకాంతం లభించినప్పుడల్లా ఆ పుస్తకాన్ని తీసుకుంటాడు. ఎప్పటికైనా ఇది వెలుగు చూస్తుందా అనుకుంటాడు. అందుకయ్యే ఖర్చు తలచుకుని నిరాశతో తిరిగి ఆ పుస్తకాన్ని దాచుకుంటాడు. కాలం గడుస్తున్నకొద్దీ పుస్తకం వ్యయం పెరుగుతూనే వుంది.


"నీ సంపాదనతో నీ జీవిత కాలంలో ఈ పుస్తకం బయటకు తేలేవు. బోడి పుస్తకం. అవతల పారేయ్" అని అతని లోపలి మనిషి గోల చేస్తుంటాడు.

'బోడి' పుస్తకం అని నిఖిల్ అంగీకరించడు అతని దృష్టిలో ఆ పుస్తకం చాలా విలువైంది. దాని అవసరం వుందా లేదా అనేది వెలుగు చూస్తే కదా నిర్ణయించబడేదనుకుంటాడు.

"ఈ పుస్తకం రాయటానికి నేను చాలా శ్రమపడ్డాను. అవమానాలు భరించాను. ఎప్పుడూ ఆలోచనల్లో కాలం గడిపాను. నేను చేస్తున్న ఇతర పనుల మీద దృష్టి నిలవలేకపోయాను. ఫలితంగా అనేక రకాలుగా నష్టపోయాను" అని డైరీలో రాసుకున్నాడు.

అయితే ఆ పుస్తకం పూర్తయ్యాక అతనికెంతో ఆనందం కలిగింది. చదువుకుంటుంటే తన్మయత్వం కలిగింది. తనలాంటివారు కొందరైనా వుంటారు. వారికీ ఆనందం కలిగిస్తుంది అనుకున్నాడు. కానీ రోజురోజుకీ ఆ పుస్తకం బాధనే మిగిల్చింది. అతనికో ఆడపిల్ల. ఆ విషయం పదేపదే అతని శ్రీమతి గుర్తు చేస్తుంటుంది.

"రచనలు చేయటం గొప్పగా భావిస్తారు చాలామంది. నిజానికి అంత బాధాకరమైన విషయం మరోటుందా? ఈ పుస్తకం లేకుంటే ఇంత బాధ




వుంటుందా? దీని కోసం ఆత్మను చంపుకోవాలి. చంపుకుంటాను. ఇదంతా నా కోసం కాదు కదా. శంకర్‌కి ప్రెస్సుంది. పనులు తక్కువగా వున్న రోజుల్లో ఈ పుస్తకం ప్రింట్ చేయవచ్చు. అది స్నేహానికి గుర్తుగా వుంటుంది" అనుకున్నాడు.

ముందు నోరు తెరిచి అడగాలి. తీరా విన్నాక కాదంటే తట్టుకోగలమా అనే అనుమానం. అలా అని ఊరుకుందామంటే కోరిక కుదిపేస్తోంది. ఇంకో సమస్య ఏమిటంటే చిన్నతనంలో అందరి తోపాటు తనూ ఆటలు పట్టించాడు శంకర్‌ని. జోకులన్నీ వాడి మీదే. ఎవర్నీ ఏమీ అనేవాడు కాదు. అయినా బాధపడి వుంటాడు. ఇప్పుడు అందుకు బదులు తీర్చుకుంటాడా?

తన ఆలోచనలకు తనకే నవ్వు వచ్చింది నిఖిల్‌కి. అందరూ గోల చేసినప్పుడు వాడు భరించాడు. ఇప్పుడు భరించటం తమ వంతు కావాలి. ఏమైనా ఓ మంచి పని కోసం శంకర్‌ని కలుస్తున్నాను అనుకున్నాడు. ముందుగా వాడిని చూసి, ఆ మాటలను బట్టి ఓ నిర్ణయానికి రావచ్చుననుకున్నాడు –

అంతలోనే

ఓ బ్యాగ్‌లో పుస్తకం తీసుకుని బయలుదేరాడు. నాలుగు గంటల ప్రయాణం. ఆ ప్రెస్సు ముందు రిక్షా దిగాడు. నిజంగానే వైభవం. అద్దాల గదుల వెనక రకరకాల యంత్రాలు కనిపిస్తున్నాయి. వాటి దగ్గర మనుషులు. ఓ పక్కన రంగులు. ఇంకో పక్కన ప్రత్యేకంగా నిర్మించిన గది. 'నేమ్ బోర్డ్' ఖరీదుగా వుంది.

"ఎవరు కావాలి సార్" అంటూ వచ్చాడు అటెండర్.

"శంకర్‌గారు"

"కార్డేమైనా వుందా?"

"లేదు."

అతను తటపటాయిస్తుండగా అన్నాడు నిఖిల్–

"శంకర్ నా చిన్ననాటి స్నేహితుడు. నిఖిల్ వచ్చాడని చెబితే చాలు"

అతను లోపలకి వెళ్ళాడు. ఉత్కంఠగా వుంది – నిఖిల్‌కి. శంకర్ వచ్చి కౌగిలించుకుంటాడా? ఒక్కసారిగా ఆఫీస్ వాతావరణాన్ని మర్చిపోయి పసివాడవుతాడా? లేక తనను మర్చిపోయి వుంటాడా? కొద్ది క్షణాలే అయినా యుగాల్లా అనిపించాయి.

"రమ్మంటున్నార్ సార్"

లేచి లోపలికి నడిచాడు. తలుపు తీయగానే చల్లటి గాలి ముఖాన్ని తాకింది. తలుపు నిఖిల్ వెనక నిశ్శబ్దంగా మూసుకుపోయింది. ఫోన్లో చాలా సీరియస్‌గా మాట్లాడుతున్నాడు – శంకర్. చాలా మార్పు వచ్చింది. బాగా లావయ్యాడు. కళ్ళకు గోల్డ్ ఫ్రేమ్‌తో కూడిన జోడు. బంగారపు రంగు చెయిన్‌తో మెరుస్తున్న చేతి గడియారం. కూర్చోవాలా వద్దా అని సందేహిస్తుండగా చేయి చూపించాడు.

అప్పుడు గమనించాడు. కార్పెట్ గొప్పగా వుంది. తను కూర్చున్న చెయిరే కాదు, ఎదురుగా వున్నవి కూడా చాలా ఖరీదుగా, గంభీరంగా వున్నాయి. మాట్లాడడం పూర్తయ్యాక చిరునవ్వుతో అడిగాడు–

"బాగున్నారా?"

నిఖిల్ వెర్రి నవ్వునవ్వాడు.

"బాగున్నావా?" అంటే బాగుండేది. తను నవ్వుతున్నా ఇబ్బందిగానే అనిపించింది. నవ్వుతూనే కాలి కిందే అమర్చిన బజర్ నొక్కాడు.

"రెండు కాఫీ పట్రా" అన్నాడు అటెండర్‌తో.

టేబుల్ మీద రకరకాల డ్రాయింగ్స్ పడున్నాయి. వాటిని చేతిలోకి తీసుకుంటూ చెప్పాడు –

"లక్ష కాపీలకు భగవద్గీత ప్రింట్ చేస్తున్నాం. స్వామీజీగారితో కాంట్రాక్ట్. అంతా 'డి.టి.పి.'లో చేస్తున్నాం. మన దగ్గర వర్క్ చాలా నీట్‌గా వుంటుంది. స్వామీజీ మేగజైన్ వర్క్ కూడా ఇక్కడే చేస్తాం."

"ఎన్ని కాపీలు?"

"నలభైవేల దాకా. ఒక్కోసారి చాలవు"

"లక్ష కాపీలు అమ్ముడు పోతాయా" అన్నాడు నిఖిల్.

శంకర్ నవ్వాడు.

"ఇదంతా ఫస్ట్ స్టెప్. ఇంకో ఆర్డరుంది. నామినల్ రేటుకిస్తారు. మిగతాది స్వామీజీ కొచ్చే విరాళాల నుంచి సబ్సిడైజ్ చేస్తారు. ఇదో ప్రాజెక్ట్."

నిఖిల్‌కి అడగాలా వద్దా అనిపించింది గాని అడిగేశాడు.

"వీటికి డబ్బులిస్తారా?"

"ఆహా! భక్తి వేరు, వ్యాపారం వేరు కదా. మేం కూడా చందాలిస్తాం. ఈ బిల్ బాగానే వస్తుంది. మా వ్యాపారంలో ఈ ఆధ్యాత్మిక పుస్తకాలే ఎక్కువ"

"బాగుంది"

"ఏం బాగుండటంలే. సంపాదించిందంతా ఆ ఇన్‌కంటాక్స్ వాళ్ళకి కట్టడం సరిపోతుంది. నిద్రా, భోజనాలు మానుకుని ఇదంతా ఎందుకో ఒక్కోసారి అర్థం కాదు." అంటుండగానే కాఫీ వచ్చింది.

కాఫీ తాగుతుండగా ఫోన్ మ్రోగింది.

"శంకర్ హియర్"

అవతల నుంచి ఏదో చెబుతున్నారు. 'సిప్' చేస్తూ వింటున్నాడు.

"అయితే ఇప్పుడేనా?" అన్నాడు.

"అవును" అనే మాటలు వినిపించాయి.

"ఏంలేదు. ఫ్రెండ్‌వచ్చారు. సర్లే. నేను బయలుదేరుతున్నా" ఫోన్ పెట్టేశాడు.

కాఫీ పూర్తయింది.

"మీ ప్రోగ్రాం ఏమిటో చెప్పండి"

"ఏం లేదు. మిమ్మల్ని చూసి వెళ్దామని వచ్చాను"

ఓ నిముషం ఏదో ఆలోచించాడు

"ఓ.కె. మనం వెళ్దాం" అన్నాడు.

ఇంటర్‌కమ్‌లో ఎవరికో ఏదో చెప్పాడు. తను ముందు నడుస్తుండగా నిఖిల్ అనుసరించాడు. మారుతీ కారు నిగనిగలాడుతోంది. డ్రైవర్ వినయంగా డోర్ తెరిచాడు.

"కూర్చోండి"

నిఖిల్ కూర్చున్నాడు. శంకర్ కూర్చోగానే మెత్తగా కదిలింది.

"టైం ఫ్యాక్టర్. ఈ సిటీలో మూడు బార్ అండ్ రెస్టారెంట్స్ వున్నాయి. అదిగాక రెండు కంపెనీలకి మనం డీలర్స్. విస్కీ, బార్, బ్రాందీలన్నీ మనమే డిస్ట్రిబ్యూట్ చేస్తాం"

తలూపాడు నిఖిల్.

## వాళ్ళే ఏడ్వలేదు

రెండు దేశాలకి మధ్య హోరాహోరీగా యుద్ధం జరుగుతోంది. ఆ యుద్ధంలో ఒక సైనికుడికి చేయి తెగిపోయింది. ఆ బాధకు వాడు తట్టుకోలేక క్రిందపడి పొర్లుతూ ఏడ్చి గోలపెట్ట సాగాడు. ఆ వైపు కొచ్చిన సైన్యాధికారి చూసి అతన్ని లేపి విషయమేమిటని అడిగాడు.

చేయి తెగిన విషయం చెప్పి గొల్లుమన్నాడు.

అది విని సైన్యాధికారి చిరాగ్గా "అవతల తలలు తెగినవాళ్ళే ఏడవకుండా పడి వున్నారు. ఇలా చేయి తెగిన దానికి ఏడుస్తావేం. లే... లేచి యుద్ధం చెయ్!" అంటూ ముందుకు సాగిపోయాడు.

–కాట్రగడ్డ

"అందుకే టైం సరిపోదు. బ్రదర్ హైదరాబాద్‌లో వున్నాడు. ఓ షేర్ కన్సల్టెన్సీ, ఓ యాడ్ ఏజెన్సీని స్టార్ట్ చేశాం" చెప్పుకుపోతున్నాడు.

కారు వెళ్ళి ఓ బార్ ముందాగింది. చాలా విశాలంగా వుంది. జనం చాలా మందున్నారు. మద్యం, మషాళా కలిసిన విచిత్ర వాసనలు నాసికల్ని తాకుతున్నాయి. నరాసరి ఓ గదిలోకి తీసుకుపోయాడు. అది మరింత అవురూపంగా వుంది. కూర్చున్నాక చెప్పాడు

"అక్టోబర్ నుండి బిజినెస్ బాగా డల్ అవుతోంది. ముఖ్యంగా ఈ లిక్కర్ బిజినెస్"

"అవును. అందరూ పొలం పనుల్లో పడతారు కదా"

"తాగుబోతులకి పొలం పనులేమిటండీ" నవ్వాడు.

"మరి..."

"ఈ దేశంలో రోజుకో మార్పు వస్తుంది. ఇప్పుడు తాజాగా ది మోస్ట్ పవర్‌ఫుల్ గాడ్ ఎవరో తెలుసా? అయ్యప్ప! ప్రతివాడూ మాల వేసుకోవటమే. అది వేసుకుంటే మందు తాగరు. మాంసం తినరు. సిగరెట్లు తాగరు. ఈ మతం మత్తేమిటో నాకు అర్థం కాదు. ఒక్కసారిగా బిజినెస్ డ్రాప్ అయిపోతుంది.టర్నోవర్ షాన్స్‌లాక్స్‌లో వుంటుంది."

"నిజంగానా" అన్నాడు నిఖిల్ నమ్మలేక.

"యస్. ఈగలు తోలుకోవటమే. ఈ దేశంలో నాకు తెలిసినంతవరకూ రెండు పిచ్చిలున్నాయి. ఒకటి మతం పిచ్చి. రెండోది విప్లవం పిచ్చి."

నిఖిల్‌కి నవ్వొచ్చింది.

శంకర్ వ్యాపారంలోనే కాదు. చాలా ఎదిగాడు!

"నిజం వీళ్ళంతా మద్యం వద్దంటారుగానీ, ఎవరూ చేయలేని పనిని అయ్యప్ప చేశాడు. అందుకే అయ్యప్ప మీద మేం యుద్ధం ఆరంభించాం" అన్నాడు నవ్వుతూ.

"ఎలా?"

"మీరు డ్రింక్ చేస్తారా?"

నిఖిల్ తల అడ్డంగా ఊపాడు.

"ఓ బీరు తాగండి. ఇంకో బీరు ఉచితంగా పొందండి" ఇది మా మొదటి స్లోగన్. అయితే మొదట్లో వారానికో రోజు పెట్టాం. ఏ మాత్రం ఉపయోగం లేదు. కొద్ది తేడా. ఇలా కాదని సీజనంతా ఆఫర్ చేశాం. స్లైట్ డిఫరెన్స్. ఇంకో ఉపాయం ఆలోచించాం. మ్యూజికల్ నైట్స్ ఎరేంజ్ చేశాం. తాజా హిట్ సాంగ్స్ పాడతారు. అందులోనూ అందమైన ఆడపిల్లలు. ఎన్ని చెయ్యి. మా గ్రాఫ్ పెంచుకోలేకపోయాం. అయ్యప్పా ఈజ్ గ్రేట్" అన్నాడు.

"మరి దీనికి పరిష్కారం లేదా?"

"అదే ఆలోచిస్తున్నాం. అన్నిచోట్లా ఇలాంటి పరిస్థితే. ఇది సోషల్ ఈవిల్. అందుకే దీన్ని ఎలా బ్రేక్ చేయాలో మాకు తెలుసు"

నిఖిల్‌కి ఉత్సాహం వచ్చింది.

"ఎలా?" అన్నాడు.

"ఒక్కటే చిక్కు. వారందరూ స్కేటర్ అయి వున్నారు. ఓ చోట చేర్చటం ఎలా అని ఆలోచిస్తున్నాం. నా కిద్దరు మిత్రులు తెలుసు. వారిని కాంటాక్ట్ చేసి భారీ ఎత్తునచేయాలి" అన్నాడతను.

"మన ఫ్రెండ్సేనా?" అన్నాడు.

"కాదు. ఇక్కడి వాళ్ళే. హేతువాదులు. నాస్తికులు. ఆ మహాసభలకి ఖర్చులు భరించి ఏర్పాటు చేయాలి. కొంతమంది జర్నలిస్టులు తెలుసు. లెఫ్ట్ ఓరియంటెడ్‌లే. వారితో ఈ అయ్యప్ప రుగ్మత ఎలా సామాజిక సమస్యగా మారిందో ఆర్టికల్స్ రాయించాలి. అంతేకాదు ఇదంతామగవారికే. ఆడవారిని ఎందుకంగీకరించరని నిలదీయాలి. అలాగాని బ్రేక్ చేయలేం"

ఎవరో వచ్చారు. శంకర్ మాట్లాడుతున్నాడు. ఆశ్చర్యపడాలో, భయపడాలో తెలీని స్థితి నిఖిల్‌ది. శంకర్‌లో మరో మనిషి కనిపిస్తున్నాడు. అతని చేతులు బ్యాగ్‌ని తడుముతున్నాయి. అడగాలా? వద్దా? తేల్చుకోలేకపోతున్నాడు. అతనెవరో వెళ్ళిపోయాడు.

"చెప్పండి" అన్నాడు నవ్వుతూ.

"ఏముంది?" అన్నాడు ఏమనాలో తెలీక.

"ఈరోజు ఉంటున్నారా?"

"వెళ్ళిపోదామనుకుంటున్నాను."

"ఫోంచేసి వెళ్ళండి. నాకు వేరే ఎంగేజ్‌మెంట్సున్నాయి. నాతో రాగలనంటే వెళ్దాం"

"లేదులెండి. వేరే పనుంది."

నిఖిల్ కెందుకో శంకర్ మృదువుగా కక్ష తీర్చుకుంటున్నట్లనిపించింది. అంతకు మించి శంకర్ విశ్వరూపం చూడాలని అతనికిలేదు. అయినాసరే అతనిలోని మనిషి అరుస్తున్నాడు.

"ఎందుకు సందేహం. అడుగు. పుస్తకాన్ని ప్రింట్ చేయమని అడుగు."

మరలా ఈ అవకాశం రాదు గాక రాదు.

నిఖిల్ నోరు పెగల్లేదు.

"మరి నేను వస్తాను"

నిఖిల్ తలూపాడు.

శంకర్ సుందాగా నడుచుకుంటూ వెళ్ళాడు.

"ఛ... నువ్వు వెధవ్వి" నిఖిల్ లోపలి మనిషి అరిచాడు. "అయినా ఫర్వాలేదు... చిన్నతనం గురించి అడిగాడా? నువ్వేం చేస్తున్నావన్నాడా? కనీసం నీకు పిల్లలెంతమందని అడిగాడా? ఏం అడిగాడని తనని అడగాలి?"

"ఇదంతా ముందే తెలుసుకదా. అడగాల్సింది."

"నో... నేను చాలా కష్టపడి నా హృదయాన్ని నా పుస్తకంలో ఆవిష్కరించా. వీడిని అడిగి పుస్తకం బయటకు తేను. నాలాంటివారు చాలా మందున్నారు. అదేదో వారినే అడుగుతాను. తలో వందిచ్చినా చాలునా పుస్తకం వెలుగు చూస్తుంది" అనుకున్నాడు.

అప్పుడు తృప్తి కలిగింది.

అయితే –

ఇంతకూ ఏది సోషల్ ఈవిల్?

అయ్యప్ప మహాత్మ్యమా?

శంకర్‌గాడి వ్యాపారమా?

రేపు నాస్తిక సభలు జరిగాయనుకుంటే...

ఎవరు డేంజర్? అయ్యప్పా? శంకరా?

ఏమిటో తికమకగా అనిపించింది. వెంటనే తేల్చుకోలేకపోయాడు.

అయితే అప్పుడే ఈ నిర్ణయానికొచ్చాడు నిఖిల్. తను ఇంకో పుస్తకం రాసి తీరాలి.

దాని పేరు మాత్రం ఇది

"శంకర్‌గాడి విశ్వరూపం"

## లండన్ ప్రేమి



మద్రాస్‌లో పుట్టి బొంబాయిలో డ్రీమ్‌గర్ల్‌గా వెండితెర నేలి– ఇప్పుడు బుల్లితెరకు మంచి సీరియల్స్ అందిస్తున్న డ్రీమ్‌గర్ల్ హేమమాలినికి విదేశ నగరాల్లో 'లండన్' అంటే చాలా ఇష్టమట. అక్కడ వాతావరణం, ఇంగ్లీషు వారు, వారి సభ్యత, సంస్కృతి ఆమెకు బాగా నచ్చాయట. "నా పిల్లలతో అప్పుడప్పుడూ లండన్ వెళ్ళి గడిపి వస్తుంటాము. లండన్ మహానగరంలో తిరుగుతుంటే నా పుట్టింట్లో వున్నట్లే వుంటుంది" అంటుంది.

– కుమారి శ్వేత

## అది అంతే!

"ఈసారి నాకు తమ్ముడు పుడ తాడు!"

"అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలవు?"

"మొన్న మా అమ్మకి కడుపునొప్పి వచ్చి ఆసుపత్రికి వెడితే చెల్లి పుట్టింది. ఇవాళ మా నాన్నకి కడుపునొప్పొచ్చి ఆసుపత్రికి వెళ్ళడం వల్ల..."

– పి.ఎస్.